



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, మాట్లాడుతున్న జి.రామకృష్ణ



ఆటోవాలాలకు... 'ఉచిత బస్సు' దెబ్బ

- ప్రశ్నార్థకం కానున్న ఉపాధి
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఆటో వాలాలపై ఉచిత బస్సు దెబ్బ పడనుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉపాధి కోసం మొదలు వ్యక్తిగత పనుల వరకూ ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనుండటంతో ఆటో డ్రైవర్ల ఉపాధికి గండి పడనుంది. జీవనాధారమైన వృత్తి ప్రశ్నార్థకం కానుంది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు వేడుకుంటున్నారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించనుంది. కర్నూలు జిల్లాలో 270 ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 46 వేల ఆటోలు ఉన్నాయి. కర్నూలు నగరంలోనే దాదాపు 20 వేల ఆటోలు ఉన్నాయి. వాటి ద్వారా రోజూ లక్షల మంది ప్రయాణాలు సాగిస్తున్నారు. వాటిలో 30 శాతం మంది మహిళలు ఉన్నారు. కర్నూలు నగరం నుంచి నన్నూరు మీదుగా ఓర్వకల్లు, వెంకాయపల్లె మీదుగా గార్గేయపురం వరకు, అలాగే నాగలాపురం, వెల్దుర్తి, తదితర ప్రాంతాలకు ఆటోలు నడుస్తుంటారు. వాటిపై ఆధారపడి వేల మంది ఆటో కార్మికులు జీవనం సాగిస్తున్నారు. మండల కేంద్రమైన హాలహర్వి నుంచి గూళ్యం గ్రామానికి, హాలహర్వి నుంచి చింతకుంట, హర్దగేరి, నిట్రవట్టి గ్రామాలకు ఆటోల్లో నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. జిల్లాలోని ప్రధాన పట్టణాలైన ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం నుంచి సమీపంలోని గ్రామాలకు ఆటోల్లో నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. కూటమి ప్రభుత్వం తీసుకురానున్న ఉచిత బస్సు పథకం వల్ల ఆటో కార్మికుల్లో 80 శాతం మంది ఉపాధి మీద దెబ్బ పడనుంది. ఇప్పటికే తెలంగాణ, కర్ణాటకలో ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులు ఉపాధిని కోల్పోయారు. జిల్లాలోనూ అదే పరిస్థితి తలెత్తనుందని ఆటో యూనియన్ నాయకులు చెబుతున్నారు. జిల్లాలో చాలా మంది నిరుద్యోగులు ఉద్యోగాలు దొరక్క ఫైనాన్స్‌లో ఆటోలు తీసుకుని నడుపుకుంటున్నారు. వారికి ఆదాయం తగ్గితే ఇఎంఐలు కట్టుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని, ఉపాధికి ఎసరు పెట్టకుండా చూడాలని ఆటో కార్మికులు వేడుకుంటున్నారు.

ఏదో ఒక దారి చూపాలి



మా జీవనోపాధి ఆటోనే. రోజుకు డీజిల్, ఆటో ఇన్సూరెన్స్, ఫైనాన్స్ టాక్స్ అన్నీ పోను రూ.300 నుంచి రూ.400 మిగులుతాయి. అవి ఇంటి ఖర్చులకు సరిపోతాయి. ఉచిత బస్సు వల్ల మా ఆటోల్లో మహిళలు ఎవరూ ఎక్కరు. మా జీవనోపాధి ఎలాగా? మాకు ఏదో ఒక దారి చూపాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాము.

- ఈరన్న, ఆటో డ్రైవర్, హాలహర్వి.

నెలకు రూ.12 వేలు ఇవ్వాలి



ఉచిత బస్సు ప్రయాణం దెబ్బ ఆటో కార్మికుల మీద పడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆటో డ్రైవర్లు ఎక్కువగా నష్టపోతారు. ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలపై ప్రభుత్వం రాయితీ ఇవ్వాలి. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి. సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలి. కర్నూలులో ఆటో నగర్ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12 వేలు ఇవ్వాలి. తక్షణమే ఆ ఆర్థిక సాయాన్ని అందించాలి.

- కె.ప్రభాకర్, ఆటో, ట్రాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఉచిత బస్సు ప్రయాణం వల్ల దాదాపు 80 శాతం మంది ఆటో కార్మికులు ఉపాధిని నష్టపోతారు. ఆటో కార్మికులకు ఆర్థిక సాయం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అయితే ఎంత ఇస్తారో ప్రకటన చేయలేదు. ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తితే ఆటోల ఇఎంఐలు కట్టుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కూటమి ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి ఆటో కార్మికులను ఆదుకోవాలి.

- బి.రాధాకృష్ణ, ఆటో యూనియన్ న్యూసిటీ ప్రధాన కార్యదర్శి.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందాం

-కార్పొరేట్లకు అనుకూల వాణిజ్యం ఒప్పందాలు ప్రమాదకరం
-సుందరయ్య సర్కిల్ నుండి కలెక్టరేట్ వరకు ట్రాక్టర్, బైకు ర్యాలీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్/ కలెక్టరేట్

వ్యవసాయ ఉత్పత్తులను ఎటువంటి పరిస్థితులలో అమెరికా బ్రిటన్లతో వాణిజ్యం ఒప్పందం చేసుకోరాదని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య సర్కిల్ నుండి కలెక్టరేట్ వరకు ట్రాక్టరు, బైకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ దగ్గర జరిగిన సభకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనందబాబు, చేతి వృత్తిదారుల జిల్లా ప్రధాన కార్యదర్శి గురు శేఖర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రలు మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, బ్రిటన్ ప్రభుత్వాలతో చేసుకునే ఒప్పందం వల్ల మన వ్యవసాయ రంగం తీవ్రమైన సంచోభంలోకి పోవడానికి అవకాశం ఉందన్నారు. ఇప్పటికే మినిమం సపోర్ట్‌ప్రైస్ లేక రైతులు ఈ కాలంలో 1,50,000 మంది మరణించారన్నారు. సరైన పంటలు లేక పంటల పెట్టుబడి ఖర్చు విపరీతంగా పెరిగిపోయి వ్యవసాయానికి దూరమవుతున్న పరిస్థితి ఉందన్నారు. ఈ పరిస్థితులలో వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం మన దేశానికి హానికరమన్నారు. పాల ఉత్పత్తులు, గోధుమలు, చక్కెర లాంటి వాటిని దిగుమతి చేసుకుంటే మన వ్యవసాయం మరింత కుదేలు అవుతుందన్నారు. వ్యవసాయమే కాక పారిశ్రామిక రంగం కూడా దెబ్బతిని కార్మికులు నిరుద్యోగం పాలవుతారని అన్నారు. నరేంద్ర మోడీ ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలని, కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలను విడనాడాలన్నారు. లేనిపక్షంలో ప్రజలు ఆకలి కేకలతో మరింత జీవన ప్రమాణాలు పడిపోయే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే కార్పొరేట్ అనుకూలమైన విధానాలకు స్వస్తి పలకకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి .రాముడు, జిల్లా నాయకులు ఎం. రాజశేఖర్, నగేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా ,సిఐటియు సీనియర్ నాయకులు ఎం.గోపాల్, సిఐటియు నగర కార్యదర్శి ఆర్. నరసింహులు, సుధాకరప్ప, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఓల్డ్‌సిటీ ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి మహమూద్, నాయకులు కుమార్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.కోటకొండ సూరి, ఎ.కృష్ణ, కల్లూరు మండలం సిఐటియు నాయకులు షేక్షావలి, రజక వృత్తిదారుల సంఘం నాయకులు శేషాద్రి, అబ్దుల్ దేశాయ్, బుధవారపేట రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అక్కడే తాగండి.. ఊగండి

- వైన్ షాపుల వద్ద పర్మిట్ రూములకు గ్రీన్ సిగ్నల్


ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా వైన్ దుకాణాల వద్దనే పర్మిట్ రూములను ఏర్పాటు చేసేకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గత ప్రభుత్వం నిషేధించిన మద్యం పర్మిట్ రూమ్‌లపై నిబంధనలు కూటమి ప్రభుత్వం ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందుకు ఒక్కొక్క రూమ్ పర్మిట్‌కు సంవత్సరానికి రూ.5 లక్షలు చలానా రూపంలో చెల్లించి లైసెన్స్ పొందాల్సి ఉంది. గరిష్టంగా 1000 అడుగులు ఉండేలా, శానిటేషన్, హ్యాండ్‌వాష్, తాగునీటి సౌకర్యం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే పర్మిట్ రూమ్ వద్ద కిచెన్‌ను నిషేధించింది. కేవలం స్నాక్స్ మాత్రమే తినడానికి అనుమతి ఇచ్చింది. అయినప్పటికీ మద్యం షాప్‌ల వద్దే మందుబాబులు మద్యం సేవించడానికి వెసులుబాటును ఈ ఉత్తర్వుల ద్వారా ప్రభుత్వం కల్పించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం లేకపోలేదు. కర్నూలు జిల్లాలో 99 వైన్ షాపులు ఉన్నాయి. ఇప్పటికే అనేక చోట్ల పాఠశాలలకు, దేవాలయాలకు, ఆసుపత్రులకు దగ్గరలో మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఆ మద్యం షాప్‌ల ముందు వెళ్లాలంటేనే పాదచారులు, ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సుదూర ప్రాంతాల్లో అయితే ఎవ్వరికి అభ్యంతరం ఉండదు. కానీ ఏకంగా నివాస ప్రాంతాల మధ్య ఉంటున్న మద్యం షాప్‌ల పక్కన రూములకు పర్మిట్ ఇస్తే ప్రజలకు అసౌకర్యంతో పాటు పలు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి లేకపోలేదని పలువురు పేర్కొంటున్నారు.

సాంకేతిక నైపుణ్యం అందించాలి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యం అందించగలిగితే ఏ దేశంలోనైనా ఉపాధి అవకాశాలను పొందవచ్చని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అభిప్రాయపడ్డారు. బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్కూలింగ్ బిల్డింగ్ బ్లాక్స్ అనే అంశంపై నిర్వహించిన జిల్లాస్థాయి వర్క్‌షాప్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ ఏ 2047 లక్ష్యంగా విద్యారంగాన్ని, మానవ వనరులను అభివృద్ధి చేసి దేశాన్ని పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. అందులో భాగంగా ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ, మౌలికవసతుల కల్పన, విద్యలో సాంకేతికత సంబంధిత విషయాలపై సలహాలు సూచనలు ఇవ్వడం కోసం ఈ వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నామన్నారు. రూ.10 లక్షలలోపు ఎస్టిమేట్ ఉన్న ప్రహరీ గోడలను, బాలికల టాయిలెట్లను వెంటనే శాంక్షన్ చేయించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కిచెన్ షెడ్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. డిఇఒ.శామ్యూల్ పాల్, సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్స్ డాక్టర్ వై ధనరాజు, మల్లయ్య, సురేంద్ర బాపూజీ, జిసిడిఒ స్నేహలత, రఫీ, మండల విద్యాశాఖ అధికారులు, క్లస్టర్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 4న వినాయక నిమజ్జనం

సెప్టెంబర్ 4న నిర్వహించనున్న వినాయక నిమజ్జనం ఉత్సవం సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పి విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు. ఎస్పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ...జిల్లాలో అన్ని ప్రాంతాల్లో జరిగే నిమజ్జనోత్సవానికి పోలీస్ శాఖ పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేలా పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఒ వెంకట నారాయణమ్మ, అడిషనల్ ఎస్పి హుసేన్ పీరా, జడ్పి సిఇఒ నాసరరెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ నాయక్ పాల్గొన్నారు.

అధికారుల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

జిల్లాలో అధికంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. బుధవారం సబ్ కలెక్టర్ ఆర్డీవోలు తహసీల్దార్లు, ఎంపిడిఒ లు, ఇరిగేషన్ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత రెండు మూడు రోజులుగా అధిక వర్షపాతం నమోదయిందన్నారు. జూన్ జూలైలో సాధారణ వర్షపాతం నమోదు కాగా, ఆగస్టులో ఇప్పటివరకు 146.5 మి.మీతో 27.8 శాతం అధిక వర్షపాతం నమోదయిందన్నారు. వచ్చే రెండు మూడు రోజుల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.పల్లెకు పోదాం కార్యక్రమం సందర్భంగా అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. తనిఖీకి సంబంధించి ప్రొఫార్మా పంపుతామని, ఆ మేరకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రతి మండలంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు

ప్రతి మండలంలో కోల్డ్ స్టోరేజ్ యూనిట్ ఏర్పాటుకు రెండెకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్‌కో ఆపరేటివ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూమిని గుర్తించే అంశంలో తహసీల్దార్లతో కో ఆర్డినేట్ చేసుకోవాలని జిల్లా సహకార శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఉన్న పిఎసి కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పీఎం జన ఔషధీ కేంద్రాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సహకార శాఖ అధికారులను ఆదేశించారు. పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లతో కోఆర్డినేట్ చేసుకొని ప్రజలకు జన ఔషధీ కేంద్రాలలో తక్కువ ధరకు మందులు అందుబాటులో ఉంటాయని తెలిసే విధంగా చూడాలన్నారు. డిస్ట్రిక్ట్‌కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీచే ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జన ఔషధీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు హాస్పిటల్ సూపరింటెండెంట్‌తో మాట్లాడాలని కలెక్టర్ జిల్లా కో ఆపరేటివ్ అధికారిని ఆదేశించారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, వేదికపై జెసి నవ్య

ప్రజల ప్రాణాలు తీస్తున్న ప్రయివేట్ కార్పొరేట్ హాస్పిటల్స్

చర్యలకు డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజల ప్రాణాలు తీస్తున్న ప్రయివేట్ కార్పొరేట్ హాస్పిటల్స్ పై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం డివైఎఫ్ఐ కర్నూలు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా, జిల్లా సహాయ కార్యదర్శి ప్రకాష్, మధు జిల్లా నాయకులు శ్రీనివాసులు హరికిషన్ రెడ్డిలు మాట్లాడారు. కర్నూ నగరంలో డబ్బే ధ్యేయంగా అనేక హాస్పిటల్స్ పనిచేస్తున్నాయని అన్నారు. గత నెల రోజుల క్రితం శ్రీ చక్ర హాస్పిటల్‌లో సాధారణ జ్వరంతో చేరిన మహిళ వైద్యుల నిర్లక్ష్యం వల్ల మరణించిందని నిన్నటి రోజున ఎన్ఆర్ పేటలోని, నోబుల్ నర్సింగ్ హోమ్ హాస్పిటల్లో డెలివరీ కోసం వచ్చిన మహిళ మరణించిందన్నారు. ఇలా నిర్లక్ష్యం చేస్తున్న హాస్పిటల్స్‌ను వెంటనే సీజ్ చేయాలని, నిర్లక్ష్యం చేసిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనేక రూపాల్లో అనేక రోగాలు చెప్పి సామాన్య ప్రజల నుండి లక్షల రూపాయలు కొల్లగొడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అనేక హాస్పిటల్స్ ఉన్నాయని అన్నారు. అనుమతులు లేని హాస్పిటల్స్ అనుమతులు ఉన్నా రెన్యువల్ కాని హాస్పిటల్స్ ఉన్నాయన్నారు.ఇంత నిర్లక్ష్యం జరుగుతున్నా అధికారులు జిల్లా వైద్య అధికారి స్పందించడం లేదన్నారు. వెంటనే అనుమతులు లేని, నిబంధనలు పాటించని హాస్పిటల్స్‌పై నిర్లక్ష్యం చేస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



బిఎస్‌పి జిల్లా నూతన కమిటీ నియామకం

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతం కుమార్ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. సంబంధిత నియామక పత్రాన్ని బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ , కమిటీ నియామకాలకు అందజేశారు. కర్నూలు జిల్లా అధ్యక్షులు గుడిపి సామేలు అధ్యక్షతన స్థానిక భూపాల్ కాంప్లెక్స్‌లో జరిగిన సమావేశంలో జిల్లా ఇన్చార్జీలుగా బొగ్గుల వనుమన్న, గాడి అరుణ్ కుమార్, జిల్లా అధ్యక్షులుగా గుడిపి సామేలు, జిల్లా ఉపాధ్యక్షులుగా బోయ రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా హెచ్.రామలింగయ్య, కార్యదర్శిగా ఎ.చిన్న నాగరాజు, సలహాదారులుగా ఎం.సుంకన్న, కుప్పగల్లు శాంతి రాజు, కోశాధికారిగా మధు శేఖర్‌లను నియమించినట్లు మంచాల లక్ష్మీనారాయణ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నియోజకవర్గ కమిటీలు సెక్టార్, బూత్ కమిటీలను వెంటనే నిర్మాణం చేయాలని రాష్ట్ర నాయకత్వం మీ మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గాల నాయకులు కర్నూలు సిటీ నుండి మధుకర్, ఎమ్మిగనూరు నియోజకవర్గం నుండి ఎ.నాగరాజు, ఎ.బంగారప్ప, నాగన్న, మంత్రాలయం నుండి పల్లెపాడు లక్ష్మన్న, బంగారప్ప, యాకోబు, ఈరేష్, కౌలుట్ల, సురేష్, సోము, శాంతిరాజు కంబాలదీన్నె ఏసేపు, స్వామిదాసు, రత్నం, సుధా తదితరులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

సుద్ద వాగు రక్షణ గోడను నిర్మించాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



కాలనీ మధ్య పారుతున్న సుద్దవాగును చూపుతున్న నరసింహులు

కర్నూలు నగరంలోని 22, 23, 24 వార్డుల పరిధిలో ఉన్న సుద్ద వాగుకు రక్షణ గోడ నిర్మించాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. నరసింహులు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 8:30 గంటలకు శ్రీరామ్ నగర్, లక్ష్మీనగర్లలో వార్డు పర్యటన చేశారు. రాత్రి నుండి కురుస్తున్న వర్షాల కారణంగా సుద్దవాగు పొంగిపొర్లి శ్రీరామ్‌నగర్, లక్ష్మీ నగర్ కాలనీలు జలమయమయ్యాయన్నారు. గణేష్ నగర్ నుండి కేసి కెనాల్ వెంట వెళ్లే వాహనాలు ప్రజల రాకపోకలకు చాలా ఇబ్బందిగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఉదయం పూట స్కూలుకు వెళ్లే విద్యార్థులు, డ్యూటీలకు వెళ్లే ఉద్యోగులు సుద్ద వాగును దాటుకొని వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లవలసిన పరిస్థితి ఉందన్నారు. సుద్దవాగు దాటుతుండగా ఆటోలో ఉన్న10 మంది విద్యార్థులు వాగులో పడిపోతుండగా స్థానిక ప్రజలు కాపాడారని అన్నారు. శుద్ధ వాగు కు రక్షణ గోడను నిర్మించి ప్రజలకు సౌకర్యంగా, ప్రమాదాలు జరగకుండా కాపాడాలని కోరారు. ఇంత జరుగు తున్నా మున్సిపల్ అధికారులు ప్రజా ప్రతినిధులు వచ్చి చూసి వెళుతున్నారు తప్ప సమస్యను పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. ఎన్నికల ముందు టిజి.భరత్ తెలుగుదేశం వార్డు నాయకులు మాకు ఓట ేయండి మేము సుద్దవాగు రక్షణ గోడను నిర్మిస్తాము డ్రైనేజీ వ్యవస్థను బాగు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికీ మంత్రి సుద్ధ వాగు రక్షణ గోడ సమస్యను పట్టించు కోవడం లేదన్నారు. సుద్ధవాగు రక్షణ గోడ నిర్మించి సుద్ధ వాగు నుంచి కేసి కెనాల్ అండర్ గ్రౌండ్ వరకు వేసిన పైప్ లైన్‌ను తొలగించి నాలుగు మీటర్ల వెడల్పుతో ఓపెన్ డ్రెయిన్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు అజ్మత్, శేఖర్ రాజు, అయ్యస్వామి, కొండయ్య పాల్గొన్నారు.

నోబుల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఘటన పై వివరాల సేకరణ

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్



ఎన్ఆర్‌పేట లోని నోబుల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను కాన్పు సమయంలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా చనిపోయిన బాలింత మృతి ఘటన పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డిఐఒ డాక్టర్ నాగప్రసాద్, డెమో శ్రీనివాసులు శెట్టి, ఎన్‌టిఆర్ వైద్య సేవ అధికారులు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.భాస్కర్ రెడ్డి, జిల్లా మేనేజర్ శ్రీధర్, టీంలీడర్ వాణి, వైద్య ఆరోగ్య మిత్ర రాఘవేంద్రలు బుధవారం ప్రాథమిక వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలింత మృతిపై , ఎన్టీఆర్ వైద్య సేవలో (ఆరోగ్యశ్రీ) అడ్మిట్ అయ్యారా వంటి అంశాలను హాస్పటల్ యాజమాన్యం, డాక్టర్ల, సిబ్బందితో తో వివరాలు అడిగి తెలుసుకున్నారు

సజావుగా ఎన్నికలు జరిగితే వైసిపికి ఉలుకెందుకు

- టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



నామినేటెడ్ పదవులు వచ్చిన వారిని అభినందిస్తున్న తిక్కారెడ్డి, సోమిశెట్టి

ఒంటిమిట్ట, పులివెందుల జడ్‌పిటిసి స్థానాలకు మంగళవారం నిర్వహించిన ఉప ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుంటే వైసిపి నాయకులకెందుకంత ఉలుకు అని టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి వైసిపి నాయకులను ప్రశ్నించారు. బుధవారం జిల్లా టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులు కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎస్‌సి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అకెపోగు ప్రభాకర్, విశ్వబ్రాహ్మణ కార్పోరేష్ చైర్మన్ కె. పార్వతమ్మతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏనాడు కూడా పులివెందులలో ప్రజలు ఓటు వేసిన పాపాన పోలేదనీ, వైఎస్ కుటుంబీకులు రిగ్గింగ్ చేసుకొని గెలువడం, ప్రజలను ఇండ్ల నుండి బయటుకు రాకుండా బయభ్రాంతులకు గురిచేయడమే ఆనవాయితీగా కొనసాగిందన్నారు. నేడు రాష్ట్రంలో చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం ప్రజలకు పూర్తి స్వేచ్ఛనిస్తూ, వారికి ఓటు వేసుకునే వీలు కల్పించి చరిత్ర సృష్టించిందన్నారు. దీనిని జీర్ణించుకోలేని వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రవింద్రారెడ్డి లాంటి వారు ప్రజాస్వామ్యం ఖూని అయిందనీ గగ్గోలు పెడుతున్నారు. ఏకంగా జిల్లా కలెక్టర్ పైనా, జిల్లా పోలీస్ ఉన్నతాధికారులపైనా, డిఐజి పైనా విరుచుకుపడున్నారన్నారు.

నామినేటెడ్ పదవులలో జిల్లాకు ప్రాధాన్యత

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఉమ్మడి కర్నూలు జిల్లాలో పార్టీలో పని చేస్తున్న వారికి నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యతనివ్వడం పట్ల జిల్లా టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ప్రకటించిన వారిలో ఎస్‌సి ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గా అకెపోగు ప్రభాకర్‌ను, బొందిలి అభివద్ధి సంస్థ చైర్మన్‌గా విక్రమ్ సింగ్‌ను, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ అనివృద్ధి సంస్థ చైర్మన్ కె.పార్వతమ్మకి అవకాశం కల్పించడం సంతోషమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు జిల్లాకు దక్కే అవకాశముందన్నారు. ఎవ్వరూ నిరాశ చెందవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు కె. నాగేంద్రకుమార్, డి. జేమ్స్, విజయకుమార్, పార్టీ నాయకులు ఎల్లప్ప, సత్రం రామక్రిష్ణ, హనుమంతరావు చౌదరి, ఎల్‌వి.ప్రసాద్, పుల్లయ్యచౌదరి, పేరపోగురాజు, నాగరాజారావు చౌదరి, రామేశ్వరరెడ్డి, డి.సుందరరాజు పాల్గొన్నారు.

భాష్యం స్కూల్ లో రక్తదానం శిబిరం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



రక్తదానం చేసిన వ్యక్తికి సర్టిఫికెట్ ఇస్తున్న డిఇఒ

కర్నూలు నగరంలోని ఎన్ఆర్‌పేట భాష్యం పాఠశాలలో 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ హాజరై ప్రారంభించి రక్తదానం చేసిన వారిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి బి.అనిల్ కుమార్ మాట్లాడుతూ రక్తదాన శిబిరానికి పిలుపునిచ్చిన భాష్యం చైర్మన్ రామకృష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావుకు కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ముగ్గురి ప్రాణాలు కాపాడిన వారైతారని ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యానికి మంచిదని, దానితో పాటు ఇతరులను కూడా కాపాడినట్టే అవుతుందని తెలిపారు. స్కూల్ ప్రిన్సిపల్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో అందరు స్ఫూర్తిగా నిలవాలని, ఎదుటి వారికి సహాయం చేయాలని అన్నారు.కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ ప్రిన్సిపల్ బిందు మాధవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రైతుల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. బుధవారం ఓర్వకల్లు మండలం హుస్సేనాపురం గ్రామంలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయిన సందర్భంగా ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో రైతులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, టిటిడి బోర్డు మెంబర్ , టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నదాత సంతోషంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ,రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు తహశీల్దార్ విద్యాసాగర్ మండల వ్యవసాయ శాఖ అధికారి ,కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్ పై దాడి....


మేనేజర్ హరి ప్రసాద్

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన ఎస్‌బిఐ బ్యాంకు మేనేజర్ హరి ప్రసాద్‌పై జీవన్ కుమార్, మొలగవల్లి గ్రామానికి చెందిన దగ్గరికి మరికొంతమంది కర్రలతో దాడి చేసి గాయపరచినట్లు బుధవారం ఆలూరు సిఐ రవిశంకర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. బాధితుని వివరాల మేరకు... మద్దికెరలో నివాసం ఉంటున్న హరిప్రసాద్ ఇంటి దగ్గరకు ఈనెల 12న జీవన్ కుమార్ అనే వ్యక్తి వచ్చి ఫోన్ చేసి 'మీతో మాట్లాడాలి. కిందికి రండి' అని చెప్పారు. కిందికి వచ్చి అతనితో మాట్లాడుతుండగా కొత్త వాహనమైన కారులో మరో ముగ్గురు కలిసి కారులో తోసేసి గుంతకల్ దారిలో ఉన్న పొలాల్లోని ఒక షెడ్డులోకి తీసుకెళ్లి కర్రలతో కొట్టారు. అక్కడి నుంచి ఆలూరులోని ఒక ఇంట్లో పెట్టి అక్కడా కర్రలతో అరి కాళ్లకు, చేయి వేలుపై, తొడలకు, పిరుదులకు కొట్టి తొందరలో డబ్బులు ఇవ్వాలని బెదిరించి రాత్రి 11 గంటలకు మద్దికెరలో ఇంటి దగ్గర వదిలేశారు. అక్కడ ఆయనకు ఎవరూ తెలియక పోవడంతో మొలగవల్లిలోని కొందరి సహకారంతో ఆలూరు ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ విషయాన్ని ఆలూరు సిఐ దృష్టికి తీసుకెళ్లగా ఆలూరు ఆస్పత్రిలోనే ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆలూరు వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోని ఆస్పత్రికి రెఫర్ చేశారు.

ప్రజాప్రతినిధి అండతోనే దాడి : గుంతకల్లు పట్టణానికి చెందిన ఒ ప్రజాప్రతినిధి అండతోనే బ్యాంకు మేనేజర్‌పై దాడి జరిగినట్లు సమాచారం. దాడిలో ప్రధాన నిందుతుడు జీవన్ కుమార్ ప్రజాప్రతినిధికి ప్రధాన అనుచరుడు. ప్రజాప్రతినిధి ఆయన అనుచరులతో హరి ప్రసాద్‌ను కిడ్నాప్ చేయించి గుంతకల్లులో వారికి సంబంధించిన స్థావరాల్లో ఉంచి దాడికి పాల్పడినట్లు తెలిసింది. జీవన్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తే దీని వెనుక ఉన్న సూత్రధారులు ఎవరో తెలుస్తుందని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు.

ఎడతెగని వర్షాలు...

- వేరుశనగ రైతు కంట కన్నీరు - పొలాల్లోనే తడిసి మగ్గుతున్న పంట

ప్రజాశక్తి - గోనెగండ్ల

గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలో వేరుశనగ పంట తడిసిపోయింది. పంట సాగు చేసిన రైతుల కంట కన్నీరు తెప్పిస్తోంది. రైతులు పంటను పీకి మిషన్ ఆడించేందుకు ఆరబెట్టారు. రోజా వర్షం కురుస్తుండడంతో పంట తడిసి వర్షం ఎప్పుడు తగ్గుతుందా... ఎప్పుడు మిషన్ ఆడించుకుందామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

గోనెగండ్ల మండలంలో బోరుబావులులాంటి నీటి వసతులు ఉన్న చోట ముందస్తుగా, ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంగా రైతులు ప్రధానంగా పత్తి, వేరుశనగ పంటలను సాగు చేశారు. ముందస్తుగా సాగు చేసిన వేరుశనగ పంట కాపు బాగా వచ్చి దిగుబడి కూడా అధికంగా వచ్చింది. పంటను పీకి మిషన్ ఆడించేందుకు రైతులు పొలాల్లో ఆరబెట్టారు. గత కొద్ది రోజులుగా రోజూ వర్షం కురుస్తుండడంతో పంట పొలాల్లోనే తడిసి నల్లగా మారి మగ్గిపోతోందని రైతులు గద్దాల గ్రామం పెద్ద కొలుకుయ్య, బగిలి ఖాజా, కోటిరాళ్ల పెద్దవీరన్న, బోయ మేకల గోరంట్ల వాపోతున్నారు. రోజూ వర్షాలు కురుస్తుండడంతో పత్తి పంటకు ఇప్పటివరకు ఇబ్బంది లేదని, మరో వారం రోజులు ఇలాగే కొనసాగితే అధిక వర్షాలకు పంట ఎర్రగా మారిపోయేటట్టు కాకుండా తెగుళ్ల బారిన పడి పంట నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.


వర్షానికి తడిసిన వేరుశనగ పంట

వారం రోజులుగా వర్షంలోనే మగ్గుతున్న పంట

- గద్దాల పెద్ద కొలుకుయ్య, గోనెగండ్ల



మూడెకరాల్లో సుమారు రూ.లక్ష పెట్టుబడితో వేరుశనగ పంట సాగు చేశాను. పంట బాగా వచ్చిందని ఆనందపడుతున్న తరుణంలో పంటను పీకి ఆరబెటాం. సుమారు వారం రోజులుగా రోజూ కురుస్తున్న వర్షానికి పంట తడిసిపోయింది. పంటను తిరగేసి ఆరబెట్టుకునే కొద్దీ మళ్లీ వర్షం కురిసి పంట పొలాల్లోనే నల్లగా మగ్గిపోతోంది. పంటకు పెట్టిన పెట్టుబడి ఖర్చులన్నా చేతికి అందుతాయా లేదా అని ఆందోళనగా ఉంది.

పంట నల్లగా మారింది

- బగిలి ఖాజా, గోనెగండ్ల



రెండెకరాల్లో సుమారు రూ.70 వేల పెట్టుబడితో వేరుశనగ సాగు చేశాను. పంటను పీకి మిషన్ ఆడించి మార్కెట్‌కు తీసుకెళ్దామని అనుకుంటున్న తరుణంలో గత ఆరు రోజులుగా రోజూ వర్షం కురుస్తోంది. వర్షానికి పంట తడిసి కాయలు నల్లగా మారిపోతున్నాయి. ఇలాంటి సరుకును మార్కెట్‌కు తీసుకెళ్లినా కొనడానికి ఎవరూ ముందుకు రారు. ఒకటి, రెండు రోజులు వర్షాలు ఇలాగే కొనసాగితే పంట చేతికొచ్చే అవకాశం కూడా ఉండదు. చేసిన కష్టంతోపాటు పంట పెట్టుబడి కూడా చేతికి అందక నష్టపోయే అవకాశం ఉంది.

ఎంపిడిఒకు గోల్డ్ మెడల్

- ఎంపిడిఒను, ఎపిఎంను అభినందిస్తున్న ఎమ్మెల్సీ, కలెక్టర్

ప్రజాశక్తి - చిప్పగిరి


గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎంపిడిఒ

ఆస్పిరేషనల్ బ్లాక్ కింద చిప్పగిరి మండలం అభివృద్ధికి విశేష సేవలను అందజేస్తున్న ఎంపిడిఒ అల్లాబకాష్‌కు, వెలుగు ఎపిఎం నాగార్జునకు గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాలు లభించాయి. కర్నూలులోని సునయన ఆడిటోరియంలో ఉత్తమ సేవలందించిన వివిధ శాఖల అధికారులకు బుధవారం సన్మాన సభ నిర్వహించారు. ఎమ్మెల్సీ బీటీ.నాయుడు, కలెక్టర్ రంజిత్ బాషా చేతులమీదుగా ఎంపిడిఒ అల్లాబకాష్, ఎపిఎం నాగార్జునలు గోల్డ్ మెడల్‌తో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. గోల్డ్ మోడల్ విధుల పట్ల మరింత బాధ్యత పెంచిందని, మండలాభివృద్ధికి కృషి చేస్తానని ఎంపిడిఒ అల్లాబకాష్ తెలిపారు. ఎంపిడిఒ అల్లాబకాష్‌కు స్థానిక కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది అభినందనలు తెలిపారు.

ముందస్తు చర్యలపై అప్రమత్తత అవసరం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రస్తుతం నెలకొన్న వర్షాలు, తుఫాను పరిస్థితుల దృష్ట్యా ముందస్తు చర్యలపై గాజులదిన్నె ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది, మండల రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. బుధవారం గాజులదిన్నె ప్రాజెక్టును ఆయన సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. ప్రాజెక్టు గేట్ల పనితీరు, నీటిమట్టం స్థాయి, నిల్వ సామర్థ్యం, ప్రవాహ నియంత్రణ వ్యవస్థ, భద్రత పనితీరును పరిశీలించారు. సంబంధిత ఇరిగేషన్ శాఖాధికారుల నుంచి ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, గేట్లు, వివిధ మరమ్మతులు, ప్రస్తుతం వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర ప్రణాళికలపై పూర్తి నివేదిక తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు వద్ద భద్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించడంతో పాటు పక్క గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రాజెక్టు పరిసరాల్లో శుభ్రత, పర్యావరణ సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు. వరద నియంత్రణ చర్యల్లో ఎలాంటి నిర్లక్ష్యమూ జరగకూడదని, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అలాగే నీటి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గంజహళ్లి గ్రామానికి వెళ్లి గాజులదిన్నెలోకి హంద్రీ నుంచి వచ్చే బ్యాక్ వాటర్ వల్ల గతంలో ఇబ్బందులు తలెత్తిన మల్లెల వాగు ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం గోనెగండ్లలోని 35వ నెంబర్ రేషన్ షాపును తనిఖీ చేసి రేషన్ షాపులో బియ్యం, జొన్నలు, చక్కెర స్టాక్, పంపిణీ, మిగులు వివరాలు పరిశీలించారు. తహశీల్దార్ రాజేశ్వరి, ప్రాజెక్టు డిఇ సుబ్బరాయుడు, ఎఇలు అలీ, శంకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉగ్ర నరసింహ పాల్గొన్నారు.


ప్రాజెక్ట్ అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

విద్యుత్ చార్జీల తగ్గింపునకు కృషి

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను తగ్గించడం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, ట్రూ అప్ చార్జీల నుంచి ట్రూ డౌన్ చార్జీలను వినియోగదారులకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి నాణ్యమైన విద్యుత్‌ను కూడా అందించలేకపోయిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ రంగంలో గత ప్రభుత్వ వైఫల్యాలను సరిచేస్తూ ప్రజలపై విద్యుత్ భారాలను తగ్గించే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ప్రస్తుతం విద్యుత్ బిల్లులో ట్రూ అప్ చార్జీలు వసూలు చేసినప్పటికీ ట్రూ డౌన్ చార్జీల పేరుతో విద్యుత్ భారాలను తగ్గిస్తామని తెలిపారు. నియోజకవర్గానికి 222 కెవి వచ్చిందని, దీని ద్వారా లోవోల్టేజ్ సమస్య తగ్గుతుందని చెప్పారు. నియోజకవర్గంలోని గాజులదిన్నె, పెద్దమరి వీడు, రాగిమాన్‌దొడ్డి గ్రామాల్లో 33 కెవి సబ్ స్టేషన్లు మంజూరయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. కొత్తగా ఇల్లు నిర్మించుకున్న వారికి మూడు నెలల సమయంలో విద్యుత్ స్తంభాలకు, విద్యుత్ లైన్‌లకు ప్రజల నుంచి ఎలాంటి భారమూ లేకుండా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ఎంతో ప్రయోజనకరమని, ఎస్సీలు, ఎస్టీలకు వంద శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. ఉమాపతి, ఇఇ విశ్వశాంతి స్వరూప్, డిఇ నాగేంద్రప్రసాద్, పట్టణ ఎఇ ప్రసన్న ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చొరవ చూపుతామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. బుధవారం కల్లుబావి, వాల్మీకి నగర్, మాలపుర వీధిలో ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ఇళ్లలోకి మురుగునీరు చేరి ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను పరామర్శించి వారి స్థితిగతులను తెలుసుకున్నామని తెలిపారు. కల్లుబావిలో పెద్ద డ్రెయినేజీ, వంక పక్కన నివసిస్తున్న ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వర్షపు నీరు ఇళ్లలోకి రాకుండా రోడ్లు, డ్రెయినేజీలు, నీటి కుళాయిల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరతానని తెలిపారు. మాజీ ఎంపిపి మురళీ, మాజీ జడ్‌పిటిసి రామ్ భీమ్‌నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు మల్లి, సిద్ధ, లక్ష్మన్న, జయరాం, ఆంజనేయులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కృష్ణమ్మ

సమస్యలకు నిలయాలుగా గ్రామాలు

- సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం
- సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని పలు గ్రామాలు సమస్యలకు నిలయంగా మారాయని, సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ కోరారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సిపిఎం మండల నాయకులు యూసుఫ్ బాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీరశేఖర్, సిపిఎం మండల నాయకులు అశోక్ మాట్లాడారు. వర్షాకాల సీజన్‌లో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. మురుగునీరు తాగునీటి పైపుల్లోకి చేరడంతో నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నట్లు తెలిపారు. వెంటనే డ్రెయినేజీలను శుభ్రం చేసే ప్రక్రియ చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.


ధర్నాలో మాట్లాడుతున్న వీరశేఖర్

వర్షాకాలంలో కూడా తాగునీటి సమస్య ఉందని, సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈదులదేవరబండ నుంచి బేతపల్లి వరకు, కప్పట్రాళ్ల నుంచి బండగట్టుకు వెళ్లే రోడ్డు నిర్మించాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది 12 గంటలైనా విధులకు హాజరు కావడం లేదని, సమయపాలన పాటించాలని, సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సచివాలయ కార్యదర్శి, విఆర్‌ఒలు సచివాలయంలో మధ్యాహ్నం వరకైనా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు మహేంద్ర, నాగేంద్ర, వీరేంద్ర నాయుడు, నాగరాజు, సూర్యచంద్ర, ఈరప్ప, అనిల్ కుమార్, బలరాముడు, సురేంద్ర పాల్గొన్నారు.


ఎంపిడిఒతో మాట్లాడుతున్న డిపో మేనేజర్ గంగాధర్

గుంతలకు మరమ్మతులు చేయండి

- తర్వాతే బస్సు నడుపుతాం
- గుంతకల్లు డిపో మేనేజర్ గంగాధర్
- డిపో మేనేజర్ తీరుపై దేగులపాడు సర్పంచి ఆవేదన

ప్రజాశక్తి - చిప్పగిరి

మారుమూల ప్రాంతమైన చిప్పగిరి మండలంలోని ఏరూరు, దేగులపాడు గ్రామాలకు బస్సు నడపాలంటే మొదట గుంతలు పూడ్చాలని, లేకుంటే బస్సు నడపలేమంటూ గుంతకల్ డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. బుధవారం ఎంపిడిఒ అల్లాబకాష్‌కు, దేగులపాడు సర్పంచి నీలకంఠకు, పంచాయతీ కార్యదర్శి నరసింహకు మండల కార్యాలయానికొచ్చి చెప్పారు. ఏరూరు, దేగులపాడు రోడ్డు గుంతలమయంగా.. అధ్వానంగా తయారైందని, బస్సు నడపాలంటే ప్రమాదకరంగా ఉందని డిఎం తెలిపారు. అధికారులు గుంతలు పూడ్చితే తప్ప బస్సు నడుపులేమంటూ డిపో మేనేజర్ మాట్లాడడంతో సర్పంచి నీలకంఠ ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి ధ్యేయంగా అధికారులు అడుగులు వేస్తుంటే, గుంతలు పూడ్చితే తప్ప బస్సు నడపలేమంటే.. విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, ప్రజల పరిస్థితి ఏమిటని వాపోయారు. అధికారులు చూస్తే గుంతలు పూడ్చడానికి నిధులు లేవంటారని, ఆర్‌టిసి అధికారులు గుంతలు పూడ్చితే తప్ప నడపబోమంటారని, ఏమిటీ పరిస్థితని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకొని దేగులపాడు గ్రామానికి బస్సులు నడిపే విధంగా చూడాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'రైతుల సమక్షంలోనే రీసర్వే'

ప్రజాశక్తి - నందవరం

రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలని జిల్లా సర్వేయర్ముని కన్నన్ తెలిపారు. బుధవారం మండలంలోని ముగతిలో రీసర్వేను పరిశీలించి, త్వరలో ప్రారంభం కానున్న హాలహర్వి భూ సర్వే బౌండరీల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూరీసర్వే చేసే పొలాల్లో ప్రతి రైతూ హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు. రైతుల అభ్యంతరం దృష్టిలో ఉంచుకొని వాటిని త్వరగా పరిష్కరించాలని తెలిపారు. సబ్ డివిజన్, జాయింట్ ఎల్‌పి నెంబర్ ఇచ్చే విషయాల్లో రైతుల అభ్యంతరాలను పరిశీలించి, రైతుల అనుమానాలను నివృత్తి చేసిన తర్వాతే సర్వే పూర్తి చేయాలన్నారు. డివిజన్ సర్వేయర్ శ్రీనివాస రాజు, మండల సర్వేయర్ అక్బర్ బాషా, గ్రామ సర్వేయర్లు ముగతి శేఖర్, ఉరుకుంద పాల్గొన్నారు.

'ఉషోదయ' ఆధ్వర్యంలో

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి - హోళగుంద

ఉషోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. బుధవారం యుఆర్‌డిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు సిహెచ్.నాగరాజు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్లేట్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా బాలాజీ పెట్రోలియం లిమిటెడ్ ప్రొప్రయిటర్ చిన్నహ్యాట శేషగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా శేషగిరి మాట్లాడారు. మండలంలోని చిన్నహ్యాట గ్రామంలో గల కన్నడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేయాలని తీసుకున్న నిర్ణయం హర్షణీయమని తెలిపారు. అలాగే సేవ చేయాలన్న ఆలోచన రావడంతో ఆలస్యం చేయకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎకె.మారెప్ప, పాండురంగ, ఖలందర్, ఉపాధ్యాయులు నాగమణిలు విద్యార్థులకు ప్లేట్లు అందించారని తెలిపారు. చిన్న హ్యాట పాఠశాలలో చదివిన విద్యార్థులు వారి పేరులో గ్రామం కలిపి రాయడంలో ఉపాధ్యాయులు రామదాసు కృషి ఉందని చెప్పారు. అంతకుముందు ప్రధానోపాధ్యాయులు ఎకె.మారెప్ప, పాండురంగ, ఉపాధ్యాయులు ఖలందర్ మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యనందించడానికి, క్రమశిక్షణను అలవరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నాగరాజును సన్మానించారు. నాగరాజు మాట్లాడుతూ... విద్యార్థులు మధ్యాహ్నం భోజనం కోసం ఇళ్లకు వెళ్లి ప్లేట్లు తీసుకొస్తున్నారని, ఆలస్యంగా రావడం వల్ల చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు తన దృష్టికి తీసుకొచ్చారని, దాదాపు రూ.20 వేల విలువ చేసే 200 భోజనాల ప్లేట్లను అందించినట్లు చెప్పారు. ఎస్‌ఎంసి కమిటీ ఛైర్మన్ నీలకంఠ, హార్డ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు హెచ్.చలపతి పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న బాలాజీ

స.హ చట్టంపై అవగాహన అవసరం

- సొసైటీ అధ్యక్షులు వెంకటపతి రాజు

ప్రజాశక్తి - కౌతాళం

సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కౌతాళం సహకార సంఘం సొసైటీ అధ్యక్షులు వెంకటపతి రాజు, సిఇఒ వెంకటేష్, బదినేహాళ్ సిఇఒ శివరాం, సభ్యులు వీరేష్, నబి సాబ్ తెలిపారు. బుధవారం సహకార సంఘం ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సహకార సంఘం సిబ్బంది బసవరాజు, టిడిపి నాయకులు రాజానందు పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

స్వర్ణశోభితమైన రాఘవేంద్రుని బృందావనం

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామి మూల బృందావనం స్వర్ణ శోభితమై భక్తులకు కనువిందు చేసింది. శ్రీరాఘవేంద్ర స్వామి సప్త రాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారికి, ఆయన ఆరాధ్య దైవమైన మూల రాములకు పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని పూజారులు నిర్మాల్యం చేసి తులసి అర్చనతో పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణ కవచాలతో పూలమాలలు వేసి అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు పూజా మందిరంలో రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు దూప దీప నైవేద్యాలతో అర్చించి మంగళ హారతులు ఇచ్చారు. మూల రాములు, జయ రాములు, దిగ్విజయ రాముల మూర్తులను చూపిస్తూ ప్రత్యేకతను వివరించారు.



రాఘవేంద్రుని సన్నిధిలో ప్రదీప్ రెడ్డి

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి సతీ సమేతంగా రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల్లో భాగంగా స్వామి వారి దర్శనం కోసం శ్రీమఠం చేరుకున్న వారికి శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. వైసిపి మండల ఉపాధ్యక్షులు తెల్లబండ్ల భీమయ్య, నాయకులు కాంతరెడ్డి, రాము, వార్డు సభ్యులు రామాంజనేయులు ఉన్నారు.

రోడ్లు గుంతలమయం

ప్రజాశక్తి - కోసిగి

స్థానిక మెయిన్ రోడ్డు గుండా ఉన్న పంచాయతీ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, పెట్రోల్ బంకు వద్ద గుంతలు పడి రోడ్డు ప్రమాదకరంగా మారింది. చిన్నపాటి వర్షానికి కూడా రోడ్లపై నీరు నిల్వ నిలుస్తోంది. గుంతల నిండా నీరు నిండి వాహనదారులకు కనబడకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ గుంతలపై రోజూ అధికారులు, నాయకులు తిరుగుతున్నా గుంతలను పూడ్చాలన్న ఆలోచన రావడం లేదు. కూటమి ప్రభుత్వంలో రోడ్లకు మరమ్మతులు చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రతి గ్రామాన రోడ్లు ఏర్పాటుచేసి సాఫీగా ప్రయాణం సాగేలా చేస్తామని కూటమి నాయకులు హామీఇచ్చారు. ఇంతవరకు హామీ పూర్తిగా అమలు కావడం లేదు. ఏదో ప్రభుత్వం వచ్చిన కొత్తలో అరకొర మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. గతేడాది నవంబర్‌లో ప్యాచ్ వర్కులకు ప్రభుత్వం నుంచి విధులు మంజూరయినా తూతూమంత్రంగా ప్యాచ్ వర్క్‌లు చేసి చేతులు దులుపుకున్నారు. ప్యాచ్ వర్క్‌లు కూడా నేడు కంకర తేలి గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు కోసిగితోపాటు మండలంలో గుంతలు పడిన రోడ్లను బాగు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


పంచాయతీ కార్యాలయం ముందు రోడ్డుపై పడిన గుంత

ఈరన్న స్వామికి కిలో వెండి విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మినరసింహ ఉరుకుంద ఈరన్న స్వామికి కిలో 50 గ్రాముల వెండితో తయారు చేసిన దీపాలను విరాళంగా ఇచ్చినట్లు దేవాలయ పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్ తెలిపారు. బుధవారం బెంగళూరుకు చెందిన తేజస్ రాజు దాతలు విరాళం అందజేసినట్లు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ కిరణ్ పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని పద్మావతి ఒకేషనల్ కళాశాలలో బుధవారం ఆదోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆవోపా అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్తా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వంశీ చైతన్య ఆస్పత్రి డాక్టర్ లేవుడాల మిథిలేష్ కుమార్ మాట్లాడారు. అవయవదానం చేయడంతో ఎందరి ప్రాణాలు కాపాడినవారవుతారని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ విరుపాక్షి మాట్లాడుతూ... చనిపోయిన తర్వాత కళ్ళు దానం చేయడం వల్ల ఎందరికో చూపు అందుతుందని తెలిపారు. అనంతరం కొందరు అవయవ దానం చేసేందుకు సమ్మతించారు. ఆవోపా కార్యదర్శి రఘు, కోశాధికారి యాదగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు రాఘవేంద్ర, ఆవోపా మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు మమతాశ్రీ, శ్రీదేవి, కళాశాల ప్రిన్సిపల్ రామలింగారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వంకదారు శ్రీనాథ్ గుప్త



వివాహ వేడుకలో పాల్గొన్న వీరభద్ర గౌడ్

ఉప ఎన్నికల్లో టిడిపి గెలుపు ఖాయం

- ఇన్‌ఛార్జి వీరభద్రగౌడ్

ప్రజాశక్తి- దేవనకొండ

కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట మండలాలకు జరిగిన జడ్‌పిటిసి ఎన్నికల్లో టిడిపి గెలుపు ఖాయమని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జి వీరభద్ర గౌడ్ తెలిపారు. బుధవారం దేవనకొండలోని శ్రీలక్ష్మీరంగ కల్యాణ మండపంలో జరిగిన ఓ వివాహ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో పులివెందుల నియోజకవర్గంలో జరిగిన స్థానిక, ఎమ్మెల్యే ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రూపు టిడిపి మద్దతుదారులను ఓటు వేయకుండా అడ్డుకునే వారని తెలిపారు. టిడిపి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలు ఓటుహక్కును వినియోగించుకున్నారని చెప్పారు. టిడిపి నాయకులు ఈదుల దేవరబండ సుభాన్, బడిగింజల రంగన్న, కప్పట్రాళ్ల మల్లికార్జున, ఆకుల వీరేష్, మాలిక్ బాష, వెలమకూర్ సర్పంచి భాస్కర్, వెంకటస్వామి గౌడ్, రాజా సాబ్, కుంకనూరు రామన్న గౌడ్, మహేష్ గౌడ్, సుధాకర్, సతీష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అవగాహనతో క్షయ నిర్మూలన

- ఇందిరా నగర్ హెల్త్ సెంటర్ వైద్యులు పృథ్వీరాజ్



ప్రదర్శన చేపడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి - ఆదోని

అవగాహనతో క్షయ వ్యాధిని అరికట్టవచ్చని ఇందిరా నగర్ హెల్త్ సెంటర్ వైద్యులు పృథ్వీరాజ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఇందిరా నగర్ హెల్త్ సెంటర్‌లోని 17వ వార్డు ఎంఎం కాలనీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో 'టిబి ముక్త్ భారత్ అభియాన్' నిర్వహించారు. సూపర్‌వైజర్లు బాబురాజు, సీతారాముడు, మేరీ అరుణ, సుబ్బమ్మ బాయి, ఎఎన్ఎం పద్మ, ఆశా వర్కర్లు నాగవేణి, సరోజ, సౌభాగ్య, ఉన్నారు.

సమన్వయంతోనే పంచాయతీల అభివృద్ధి



వర్క్ షాపులో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

- ఎంపిడిఒ అల్లా బకాష్, సర్పంచులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని ఎంపిడిఒ అల్లా బకాష్, డేగలపాడు సర్పంచి నీలకంఠ, నేమకల్లు సర్పంచి ప్రేమ్ కుమార్, కుందనగుర్తి సర్పంచి కొండా పురుషోత్తం తెలిపారు. బుధవారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కార్యాలయంలో ఎంపిడిఒ అల్లాబకాష్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పురోగతి సంచిక వెర్షన్ 1.0 నుంచి వెర్షన్ 2.0 పరివర్తన వ్యాప్తిపై ఒకరోజు వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమం కింద చిప్పగిరి మండలం ఉండడంతో పంచాయతీలన్నీ పురోగతి సాధించడానికి నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. వైద్యం, విద్య, నీటి సమస్యను పరిష్కరించేందుకు, మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఆస్పిరేషనల్ బ్లాక్ కింద విడుదలయ్యే నిధులు అప్రూవ్ అయ్యాయని, త్వరలోనే పనులు కూడా మొదలు పెడతామని చెప్పారు. తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, పరిపాలన అధికారి శ్రీనివాసులు, వైద్యాధికారి అఫ్రోజ్ జహన్, డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు, ఎఒ శ్రీరామ్ ప్రవీణ్, ఏపీఎం జుబేర్ అహ్మద్, ఆస్పిరేషనల్ అధికారి నరసింహులు, సూపర్‌వైజర్ ఈరమ్మ, ఎంపిటిసి భీమలింగ, సురేష్, గోవిందు, ఈరప్ప, నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శులు బాలన్న, నరేంద్ర, సిసింద్రీ, సురేంద్ర, సుధీర్, ప్రమీల, నరసింహులు, వెలుగు సిసిలు లక్ష్మన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతు కళ్లుగప్పి రూ.5 లక్షలు చోరీ

ప్రజాశక్తి - ఆలూరు

హాలహర్వి మండలం మల్లికార్జున పల్లి గ్రామానికి చెందిన రైతు గోపాల్ రెడ్డి బైక్ నుంచి బుధవారం రూ.5 లక్షలు, 5 గ్రాముల బంగారు కమ్మలును దొంగలించినట్లు ఆలూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధిత రైతు వివరాల మేరకు... 5 ఎకరాల భూమిని విండ్ పవర్ కంపెనీకి అమ్మగా ఆయా కంపెనీ తన బ్యాంకు ఖాతాలో రూ.5 లక్షలను జమ చేశాయి. ఆలూరు ఎస్‌బిఐ బ్యాంకు నుంచి రూ.5 లక్షలు డ్రా చేసి గోపాల్ రెడ్డి, ఆయన మేనల్లుడు కలిసి వెళ్లారు. నగదును చేయి సంచిలో పెట్టుకొని బైక్ సైడ్ బ్యాగ్‌లో పెట్టుకొని క్లిప్ వేసుకొని ఇంటికి బయల్దేరారు. హాలహర్వికి వెళ్లే మార్గంలో ఆలూరు పొందు రంగస్వామి ఆలయం పక్కనున్న కట్టెల డిపో ముందు పెట్టి మూత్రం పోసేందుకు వెళ్లగా పల్సర్ బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి బైక్‌లోని బ్యాగ్ ను దొంగలించి హాలహర్వి వైపు పారిపోయారు. వెంబడించిన కనబడలేదని బాధితుడు తెలిపారు.



రైతు గోపాల్ రెడ్డి

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

- రైతులకు యూరియాను అందించాలి

- రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య

ప్రజాశక్తి - కౌతాళం



జిల్లాలో వర్షాలు బాగా కురుస్తున్నాయని, వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యం వీడి రైతులకు యూరియా అందించాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. 25 రోజుల నుంచి రైతులు యూరియా కోసం రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మండలంలో 25 వేల హెక్టార్లలో పంట సాగయిందని, సకాలంలో యూరియా అందకపోవడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెద్ద పెద్ద రైతులకు యూరియా అందుతోందని, చిన్న, సన్నకారు రైతులకు యూరియా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో రైతులకు ఎరువులు అందించకపోతే రైతుల ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



జాతీయ జెండాతో ప్రదర్శనలో విద్యార్థులు

జాతీయ జెండా కీర్తి ప్రతిష్టను చాటాలి

- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ మురళీమోహన్

ప్రజాశక్తి - ఆదోని

జాతీయ జెండా కీర్తి ప్రతిష్టలు పెంచే విధంగా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ మురళీమోహన్ తెలిపారు. మంగళవారం ఆదోని ఆర్ట్స్ సైన్స్ కళాశాల నుంచి 'హర్ ఘర్ తిరంగా' నిర్వహించారు. ఎన్‌సిసి, ఎన్‌ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల నుంచి ఎమ్మిగనూరు సర్కిల్ వరకు జాతీయ పతాకం విశిష్టతను తెలియచేస్తూ దాదాపు 130 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు ఎర్రిస్వామి, ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జోనాథన్ విక్లిఫ్, ఎన్‌సిసి అధికారి కెప్టెన్ గోవిందు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండో రోజూ ఆర్‌టిసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఆర్‌టిసి డిపో ముందు బుధవారం రెండోరోజూ ఆర్‌టిసి ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. డిపో అధ్యక్షులు ఎల్.బసవరాజు, డిపో కార్యదర్శి టి.రామలింగప్ప, ట్రెజరర్ కె.నాగరాజు, జాయింట్ సెక్రటరీ పి.ఖాజా హుస్సేన్, వీరేష్, బాలకృష్ణ, గ్యారేజ్ కార్యదర్శి ఎం.షరీఫ్, ప్రెసిడెంట్ ఎజాజ్, సతీష్ కుమార్, మౌనేష్, అబ్దుల్లా, హనుమంతు, ఎల్లప్ప, మాబు సాబ్, మహిళా ఉద్యోగులు మీనాక్షి, హేమలత, గాయత్రి, లక్ష్మి ఉన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన బండలు లాగుడు పోటీల్లో గెలుపొందిన వారికి టిడిపి నాయకులు బహుమతులు అందజేశారు. బుధవారం స్థానిక సంత మార్కెట్ ఆవరణంలో మొత్తం 8 జతల ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. వనికె రాముకు చెందిన ఎద్దుల జత మొదటి స్థానంలో నిలవగా టిడిపి పట్టణ ఇన్‌ఛార్జి బి.వరదరాజులు రూ.15,116, రెండో స్థానంలో నిలిచిన ఈడిగ గోవిందుకు టిడిపి నాయకులు కంసాలి నరసింహ రూ.10,116, మూడో స్థానంలో నిలిచిన ఎర్రమూతుల గోవిందుకు టిడిపి నాయకులు ఎంపిటిసి మేకల వెంకటేష్ రూ.5,116 అందజేశారు. విజేతలకు సర్పంచి తెల్లబండ్ల భీమయ్య శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, టిడిపి నాయకులు అశోక్ రెడ్డి, హైస్కూల్ చైర్మన్ మఠ్రి నరసింహ, నాయకులు పవన్ కుమార్, మఠ్రి శివ, కె.రాఘవేంద్ర, వైసిపి నాయకులు కురువ మల్లికార్జున, వార్డు సభ్యులు రామాంజనేయులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నాయకులు

మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం : ఎక్సైజ్ ఎస్ఐలు


నందికొట్కూరు టౌన్ : విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దామని ఎక్సైజ్ ఎస్ఐ జపురుల్లా పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీనంది జూనియర్ కళాశాలలో నశా ముక్త భారత్ అభియాన్‌పై ఆయన విద్యార్థులకు వివరించారు. దేశ అభివృద్ధిలో యువశక్తి ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం జిల్లాను మాదకద్రవ్య రహితంగా మార్చడానికి కృషి చేస్తామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీకాంత్, ఎఐ జయచంద్ర, ఎక్సైజ్ సిబ్బంది మధుసూదన్, శివన్న, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూర్ : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆత్మకూరు ఎక్సైజ్ ఎస్ఐలు జగదీష్, వీరస్వాములు పేర్కొన్నారు. నంద్యాల జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నశా ముక్త భారత్ అభియాన్‌పై విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సును నిర్వహించి వారు మాట్లాడరు. విద్యార్థులు ఈ దశలోనే విద్యపై దృష్టి సారించాలని, చెడు మార్గాన్ని ఎంచుకున్నట్లయితే జీవితం నాశనం అవుతుందని సూచించారు. ధూమ, మద్యపానానికి, గంజాయికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, కళాశాల సిబ్బంది, ప్రొహిబీషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది ఎస్. చెన్నయ్య, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబులు ఎం. వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ కానిస్టేబులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించండి

-ఎల్ఆర్ఎస్ అవగాహన సదస్సులో జెసి డాక్టర్ నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అనధికార లే ఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని అర్హులైన వారు వినియోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య సూచించారు. బుధవారం కర్నూలు ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ఎల్ఆర్‌యస్ పథకంపై లైసెన్స్ ఇంజనీర్లతో జెసి, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. జెసి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకంలో కొన్ని సవరణలు చేస్తూ ప్రభుత్వం జీఓ 134 జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ 30కి ముందు ఏర్పాటైన అనధికార లేఔట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందన్నారు. ఇందుకు అక్టోబర్ 24లోపు రూ.10 వేలు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది తనిఖీ చేసి ధ్రువీకరించిన తర్వాత మార్కెట్ విలువలో 14 శాతం అపరాధ రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. 45 రోజుల్లోపు పూర్తి రుసుం చెల్లించిన వారికి 10 శాతం రాయితీ, 45 నుంచి 90 రోజుల వ్యవధిలో చెల్లిం చిన వారికి 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. గడువులోపు క్రమబద్ధీకరించుకుని అనధికార లేఔట్లు, ప్లాట్లకు విద్యుత్ సౌకర్యం, నీటి సరఫరా, డ్రైనేజీ వంటి సదుపాయాలకు అనుమతి ఉండదని వెల్లడించారు. ఈ పథకాన్ని యజమానులు, రియల్టర్లు వినియోగించుకునేలా లైసెన్స్ ఇంజనీర్లు చొరవ చూపాలని జేసీ సూచించారు. ఆర్‌డిటిటిపి సంజీవ్ కుమార్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అంజాద్ బాష, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : ఎఒ


కొత్తపల్లి, నందికొట్కూర్ టౌన్ : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒలు



ప్రజాశక్తి - కొత్తపల్లి

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని ఎఒ అమీరున్నీసా బేగం పేర్కొన్నారు. మండల పరిధిలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, వరి పంటలను ఆమె బుధవారం పరిశీలించారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టి వర్షపు నీటిని పొలం నుండి కాల్వ ద్వారా బయటికి పంపించాలని సూచించారు. ఎకరాకు 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాషియం లేదా 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 19-19-19 లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. తెగుళ్ల వ్యాపించే అవకాశం ఉన్నందున మూడు గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండిజిమ్ లీటర్ నీటిలో పిచికారి పంటలపై చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసులు, రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నందికొట్కూరు టౌన్ : రైతులు మొక్కజొన్న పంటల్లో సస్యరక్షణ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఎఒ షేక్షావలి తెలిపారు. మండలంలోని వడ్డెమాను, కోనేటమ్మపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోందిలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మొక్కజొన్నలో కాండంతొలిచే పురుగు నివారణకు సస్యరక్షణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. పిల్ల పురుగులు ఆకులపై పత్ర హరితాన్ని గోకి తింటాయన్నారు. ఆ తర్వాత కాండం లోపలికి చేరి ఆకులపై వరుస క్రమంలో పొడవాటి చిల్లులు కనిపిస్తాయన్నారు. నివారణకు క్లోరెంట్రినిప్రోల్ 18.5శాఆతం ఎస్‌పిఏ60 మీ.లి/ఎకరానికి పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్న పంటను అధిక వర్షాల నుంచి కాపాడుకోవడానికి పొలాల్లో ఉన్న వర్షపు నీటిని వెంటనే బయటికి తీసివేయాలన్నారు. ఆ తర్వాత రైతులకు అందుబాటులో ఉన్న ఎరువులని వేసుకొని పంటను కాపాడుకోవాలని సూచించారు.

ఇన్సూరెన్స్‌కు ఈ నెల 14 చివరి తేదీ..

క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవడానికి ఈ నెల 14తేదీ చివరి తేదీ అని తెలిపారు. మొక్కజొన్నకు రైతులందరూ క్రాఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం అమౌంట్ చెల్లించి చేయించుకోవాల్సిందిగా కోరారు.



ఆర్‌టిఇ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

విద్యాహక్కు చట్టం పకడ్బందీగా అమలు కోసం"పోరు బాట"

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలోని ఆర్‌టిఇ విద్యార్థుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని రాయలసీమ విద్యార్థి సంఘాల జెఎసి చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు, బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పగడాల ఆనంద్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని బిర్లా కాంపౌండ్ సాయి వసంత్ కాంప్లెక్స్‌లో జెఎసి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. విద్యా హక్కు చట్టం-2009 అమలుకు రాష్ట్రవ్యాప్తంగా 'పోరుబాట' కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాల ఫీజు బకాయిలు చెల్లించడంతో పాటు, ప్రభుత్వం విద్యాసంస్థలకు ఇస్తున్న ఫీజును రూ.30,000కు పెంచాలని, ఆర్‌టిఇ విద్యార్థులకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని, మార్కులు-హాజరు పర్యవేక్షణను మండల విద్యా శాఖ అధికారులు చేపట్టాలని, ఫేజ్-1లో సీట్లు పొంది రిజెక్ట్ అయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేసిన ఫీజులు తిరిగి ఇవ్వాలని పాఠశాల మేనేజ్‌మెంట్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఇ పేరెంట్స్ సమితి నాయకులు ఖాదర్ ఖాన్, అశోక్, నగేష్, విశ్వనాథ్ యాదవ్, ఉసేన్‌పీరా, రవి, మహేంద్ర, షకీల్, విద్యార్థి సంఘాల నాయకులు గణేష్, జయకృష్ణ, ఆనంద్, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


మెడికల్ కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అభిజిత్ సేథ్

మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ వ్యతిరేక ప్రతిజ్ఞ

12 నుంచి 18 వరకు యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలు

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) ఎన్ఎంసిలు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెడికల్ కళాశాలలతో బుధవారం 'యాంటీ ర్యాగింగ్' అంశం పై ఎన్ఎంసి చైర్మెన్ డాక్టర్ అభిజత్ సేథ్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ జూమ్ మీటింగ్ లో దేశవ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీల్లో యాంటీ ర్యాగింగ్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని మెడికల్ కళాశాలలలో ఈనెల 12 నుంచి 18 వరకు యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలు నిర్వహించాలని, అందులో ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలను, ర్యాగింగ్ చట్టం ద్వారా తీసుకునే కఠినమైన చర్యల గురించి విద్యార్థులకు అవగాహన కలిగించాలని అన్ని మెడికల్ కళాశాలలను కోరారు. ఈ వారం రోజులు వివిధ రూపాల్లో విద్యార్థులకు అవగాహన కలిగించాలని తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీల విద్యార్థులతో ర్యాగింగ్ వ్యతిరేక ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. ఈ జూమ్ మీటింగులో కర్నూలు మెడికల్ కళాశాల నుండి అడిషనల్ డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరి చరణ్, డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ రేణుకా దేవి, డాక్టర్ సింధియా శుభప్రద, యాంటి ర్యాగింగ్ కమిటీ సభ్యులు, వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పీజీ, యూజీ విద్యార్థులు ఈ జూమ్ మీటింగ్‌లో పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలి

కెపిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీహర్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సామాజిక సేవలో భాగస్వామ్యం అవుతూ ముందుకు సాగుతానని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం శ్రీహర్ష పేర్కొన్నారు. బుధవారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక బిర్లా కాంపౌండ్ లోని కెపిఎస్ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని టూ టౌన్ సిఐ నాగరాజు రావు విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీహర్ష మాట్లాడుతూ రక్తదానం ద్వారా సేకరించిన రక్తాన్ని తలసేమియా బాధితులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాన్ని తన పుట్టినరోజు సందర్భంగా నిర్వహించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. కర్నూలు సమగ్ర అభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా సంఘాలు నాయకులు ఆయనను కలిసి అభినందించారు. ముందుగా గోశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన



అనంతరం యువకుల మధ్య కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. గోశాల మాజీ కమిటీ సభ్యులు శ్రీకాంత్, మాజీ ఎంపిటిసి రఘునందన్ రెడ్డి, కెపిఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతి సూచిక 2.0 పై శిక్షణ

ప్రజాశక్తి మద్దికేర

ప్రతి గ్రామపంచాయతీ పురోగతి సుస్థిరత సాధించేలా, చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ స్వర్ణలత అన్నారు. మద్దికేర ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి అనిత యాదవ్ అధ్యక్షతన ఎంపిడిఒ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు, మండల లెవెల్ అధికారులకు, పంచాయతీ పురోగతి సూచిక 2.0పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు, ఆరోగ్యం, నీరు సమృద్ధి, పచ్చదనం పరిశుభ్రత వంటి 9 అంశాలపై శిక్షణ ఇచ్చారు. సుపరిపాలన కలిగిన గ్రామపంచాయతీలుగా ఉండేందుకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను వివరించారు. జెడ్పిటిసి మురళీధర్ రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, సుధాకర్, శివకుమార్, దిశమ్మ రేణుక రంగస్వామి, హరికృష్ణ, మండల అధికారులు రామాంజనేయులు, లక్ష్మన్న, ఎంఇఒ రంగస్వామి, ఇతర శాఖ అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.



ఓకే రైతుకు 100సంచుల యూరియా!

ఎలా ఇస్తారు ....ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఉయ్యాలాడ గ్రామంలోని సంజీవరెడ్డి అన్న రైతుకు వ్యవసాయ శాఖ ద్వారా సరఫరా చేసిన యూరియాను ఆయనకు అందజేయడం ఎంతవరకు సమంజసమని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ వ్యవసాయ శాఖ అధికారులను ప్రశ్నించారు. మరో 100 సంచల యూరియాను నన్నూరు గ్రామానికి తరలించారని అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓర్వకల్ మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి వ్యవసాయ శాఖ ద్వారా సరఫరా చేసిన యూరియాను రైతులకు ఇవ్వకుండా పక్కదారి పట్టించడం తగదన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సరఫరా చేయాల్సిన యూరియాను ఇలా వ్యవసాయ శాఖ అధికారులు ఒకే రైతుకు ఇవ్వడం తగదన్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఉయ్యాలవాడ గ్రామానికి వచ్చిన యూరియాను రైతులకే సరఫరా చేయాలని పేర్కొన్నారు.

మానవత్వం చాటుకున్న 'అశోకా' ఉమెన్స్ కాలేజ్ చైర్మన్

గాయపడిన వారిని జి జి హెచ్ కు తరలింపు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామ శివారులో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని తన వాహనంలో ఎక్కించుకొని కర్నూల్ ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేర్పించిన అశోక ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కె.అశోకవర్ధన్ రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి చెందిన ఓ పెళ్లి వారి ట్రాక్టర్‌ని లారీ పెద్దటేకూరు గ్రామ శివారులో ఢీకొట్టింది. పెళ్లి బృందం వారు సుమారు 10 మందికి పైగా తీవ్రగాయాలై రోడ్డు పై చెల్లాచెదురుగా పడ్డారు. అదే సమయంలో చిన్నటేకూర్ లో ఉన్న అశోక ఉమెన్స్ కాలేజ్ క్యాంపస్ నుండి బయలుదేరి కర్నూలు వైపుగా వెళ్తున్న 'అశోకా' కాలేజ్ చైర్మన్ అశోక్‌వర్ధన్ రెడ్డి తీవ్ర రక్తస్రావమై విలవిల్లాడుతున్న ఐదుగురు పెళ్లి వారిని తన వాహనంలో ఎక్కించుకొని ప్రభుత్వ హాస్పిటల్ క్యాజువాలిటీ వార్డునకు తరలించారు. ఆలస్యం చేయకుండా హాస్పిటల్‌కు తరలించడంతో వారు ప్రాణాపాయం తప్పి కోలుకుంటున్నారని గ్రామస్తులు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

-ఎస్‌పి విక్రాంత్ పాటిల్

-'నేను ట్రాఫిక్ మిత్ర' ఉల్లంఘనల పై ఫిర్యాదుల వెల్లువ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ బుధవారం హెచ్చరించారు. వారం రోజుల క్రితం జిల్లా ఎస్‌పి ప్రారంభించిన 'నేను ట్రాఫిక్ మిత్ర' కర్నూలు పోలీస్ వాట్సాప్ గవర్నెన్స్ సెల్ : 7777877722 కు మంచి స్పందన వస్తుందని తెలిపారు. వివిధ ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై రాంగ్ పార్కింగ్, రాంగ్ రూట్, త్రిబుల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్‌లపై 19 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. మీ ప్రాంతంలో ఎవరైనా, ఎక్కడైనా వివిధ రకాలుగా ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే అటువంటి వారి ఫొటోలు, వీడియోలు తీసి నేను ట్రాఫిక్ మిత్ర కర్నూలు పోలీస్ వాట్సాప్ గవర్నెన్స్ సెల్ : 7777877722 కు పంపించాలన్నారు. ఈ ఫొటోలు, వీడియోలను కర్నూలు ట్రాఫిక్ పోలీసులు నిర్ధారణ చేసి కౌనెల్సింగ్ ఇచ్చి, జరిమానాలు విధిస్తారన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్‌పి తెలిపారు.



విజిల్ ఊది హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న ఎంపి



బైక్ ర్యాలీలో డిఇఒ, ఎంపీ

హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీ దృశ్యమాలిక



హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీనీ జెండా ఊపి ప్రారంభిస్తున్న కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, జెసి డాక్టర్ బి.నవ్య



హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీలో ముందుబాగానా స్కూటీపై వెళ్తున్న కర్నూలు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి,నవ్య



హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీలో కర్నూలు కార్పొరేషన్ కమిషన్ , ఇతర అధికారులు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మంజుల

55 మీటర్ల జాతీయ పతాకంతో శ్రీ చైతన్య విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని మంగళవారం కర్నూలు నగరంలో 55 మీటర్ల జాతీయ పతాకంతో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని కొండారెడ్డి బురుజు వరకు చేపట్టి దేశభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ చైతన్య పాఠశాల ఎజిఎం సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తిని, ఐక్యతను చాటి చెప్పేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. వందల మంది విద్యార్థులతో చేపట్టి జాతీయ పతాక ప్రదర్శన నగర వీధుల్లో ప్రజలందరినీ ఆకట్టుకుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామాంజనేయులు, కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, ఎఒ పరమేశ్వర రెడ్డి, డీన్ రాజేష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఫ్లోరోసిస్ పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం ఉల్లిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి వామసముద్రం మండల ప్రజాపరిషత్ పాఠశాలలో బుధవారం జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమములో భాగంగా విద్యార్థులకు ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వలన శరీరంలోని కండరాల బలహీనత, అధిక దాహం, అధిక మూత్ర విసర్జన, మలబద్ధకం, కడుపు నొప్పి, అతిసారం, పోషకాలను శరీరం శోషించుకోకపోవడం వలన రక్తహీనతకు గురికావడం, గర్భస్రావం కావడం, శరీరంలోని కండరాలు బలహీనంగా బిగుసుకొని పోవడం నరాల బలహీనత, కీళ్ల నొప్పులు లాంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. ఈ వ్యాధిని నివారించాలంటే మినరల్ నీరు తాగడం, క్యాల్షియం, ఆకు కూరలు, పుల్లగా ఉన్న అన్నీ పండ్లు జామకాయ, ఉసిరి, నిమ్మకాయ, నారింజ, ద్రాక్ష, జింక్‌ను కలిగిన గుమ్మడికాయలు, చిక్కుల్లు, పప్పు ధాన్యాలు ప్రతిరోజు తీసుకొనే ఆహారంలో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమములో హెడ్ మాస్టర్ మాలతి దేవి, ఉపాధ్యాయురాలు వనజవాణి, ఆరోగ్య కార్యకర్త నయోమీ, ఆషా ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

'దేశభక్తిని చాటుదాం'విద్యార్థుల సాంస్కతిక ఉత్సవాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో 'దేశభక్తిని చాటుదాం' విద్యార్థుల సాంస్కృతిక ఉత్సవాలు ఆగస్టు 14న గురువారం ఉదయం 10 గంటలకు పింగళి సూరన్న తెలుగు తోటలో నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంపి బసవరాజు, ఇరాజు బుధవారం ఒక్త ప్రకటనలో తెలిపారు. సామాజిక చైతన్యానికి సాహిత్యం, కళలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఆ చైతన్యాన్ని బాల్యంలోనే కలిగించి ఉత్తమ పౌరులుగా దేశభక్తి కలిగిన సృజన శీలురుగా, మంచి కళాకారులుగా తీర్చిదిద్దే క్రమంలో ప్రజానాట్యమండలి శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తుందన్నారు. శిక్షణ పొందిన బాలబాలికల సాంస్కృతిక కార్యక్రమాలను సుమారు 200 మంది విద్యార్థులు కళారూపాలు ప్రదర్శిస్తారన్నారు. అధికారులు, అతిథులు, కళాకారులు, సాహితీవేత్తలు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రైవేటు పాఠశాలల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - వెల్దుర్తి : విద్యాహక్కు చట్టం కింద మండలంలోని ప్రయివేటు పాఠశాలలో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంఇఒ2 రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిందని తెలిపారు. నివాసం నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలల్లో మాత్రమే ప్రవేశాలు ఉంటాయన్నారు. బిపిఎల్ కుటుంబాలకు చెందిన వారు. సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 25వ తేదీ వరకు గడువు ఉందని, ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



మెరుగైన పారిశుధ్యానికి ప్రణాళికలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో మెరుగైన పారిశుధ్య పనుల నిర్వహణకు వార్డు స్థాయిలో ప్రణాళికలు రూపొందించుకొని, సంబంధింత అధికారులు సమన్వయంతో అమలు చేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. బుధవారం పారిశుధ్య, ఇంజనీరింగ్, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షన్ రాష్ట్ర నోడల్ అధికారి ఉదయ్ సింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 100శాతం ఇంటింటి చెత్తా సేకరణ, పకడ్బందీగా పూడికతీత పనులు, ప్లాస్టిక్ వాడకం నిషేధం, చెత్తకుప్పల తొలగింపు కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఇంచార్జ్జి ఎస్ఇ శేషసాయి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.